క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో షబేఖదర్



కదిరిలో ముస్తాబైన మసీదు

బత్తలపల్లి: ముస్లింలకు శుభప్రదమైన, పుణ్యప్రదమైన రాత్రి షబేఖదర్(షబ్-ఏ-ఖదర్) వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి మండలంలోని పలువురు ముస్లింలు తెల్లవార్లు జాగారణ చేశారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిచారు. రాత్రి జాగరణ చేసేవారికి అన్నదానం ఏర్పాటు చేశారు.

కదిరి అర్బన్: పట్టణంలోని పలు మసీదుల్లో శనివారం రాత్రి షబ్ ఏ ఖదర్ (సతామి) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. షబ్ అంటే రాత్రి ఖదర్ అంటే గౌరవమైన అని అర్థం. ఈ రోజు జాగరణతోవెయ్యి మాసాల పుణ్యఫలం దక్కుతుందని దివ్య ఖురాన్ చెబుతోంది.

దాడిలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి వాణివీధికి చెందిన కె.అంబరీష్ అతడి బంధువు, వరుసకు మామ అయిన వెంకటరమణ ఇద్దరూ కలిసి కురబలకోట మండలంలోని అంగళ్లు గొర్రెలసంతకు వచ్చారు. అక్కడ గొర్రెలకు నీరు పట్టించే విషయమై స్థానికుడైన బాబ్‌జాన్‌తో వాగ్వివాదం జరిగింది. ఈ గొడవలో ఆవేశానికి లోనైన బాబ్‌జాన్ వారిద్దరిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో అంబరీష్, వెంకటరమణలు తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం అంబరీష్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గాండ్లపెంట: మలమీదపల్లి, కటారుపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీఓ రామానాయక్, ఏపీఓ మంజునాథ్ పరిశీలించారు. వేసవి నేపథ్యంలో కూలీలకు రూ.300 కూలి చెల్లిస్తామని తెలిపారు. ప్రస్తుతం 7 గ్రామ సచివాలయాల పరిధిలో 1,050 మంది కూలీలు పనిచేస్తున్నారని ఏపీఓ చెప్పారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

కదిరి టౌన్: కుటాగుళ్ల గ్రామ సమీపంలో నాటుసారా అమ్ముతున్న నలుగురి సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 120 లీటర్ల నాటుసారా, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టు ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ నాగేంద్రమ్మ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ప్రచారం

నల్లమాడ: వంకరకుంట పంచాయితీలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కుళ్లాయప్ప తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వాహనాల తనిఖీ

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం గేట్ నుంచి ధర్మవరానికి వెళ్లే రహదారిలో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ధర్మవరం ట్రైనీ డీఎస్పీ, రామగిరి సీఐ శివ అంజనేయులు ఆధ్వర్యంలో వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో చెన్నేకొత్తపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది, కనగానపల్లి సివిల్ సప్లయిస్ టీం పాల్గొన్నారు.

'శాశ్వత అభివృద్ధికి ఇదే నిదర్శనం'



పైపులను చూపుతున్న అపర్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేస్తున్న కృషికి నిలువెత్తు సాక్ష్యం ఇదేనంటూ ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి రోడ్డుపై తాగునీటి పథకం కోసం తరలిస్తున్న పైపులను చూపించారు. శనివారం 19వ వార్డు ప్రశాంతి గ్రామంలో వై జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజవర్గంలో 193 చెరువులకు 864 కోట్లతో చేపడుతున్న ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులను తరలించే లారీలు తారసపడగా ఆమె పైవిధంగా స్పందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో శ్రీధర్‌రెడ్డి ప్రతి చెరువును కృష్ణాజలాలతో నింపేందుకు కృషి చేస్తున్నారన్నారు. పుట్టపర్తి అర్బన్ కన్వీనర్ రంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి సాయిలీలారెడ్డి, పరుశురాం నాయక్, సాయిగీత, సూర్యాగౌడ్, పవన్‌కుమార్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ రమణారెడ్డి, మాజీ నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, నాయకులు, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, కవిత, కుమారి, దాసిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, హనుమంత్‌రెడ్డి, ఓబుళేసు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదరిక నిర్మూలన

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- వైఎస్సార్‌సీపీలోకి 29, 22వ వార్డుల నుంచి 365 కుటుంబాలు



29వ వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన 305కుటుంబాలు



22వ వార్డు ఇన్‌చార్జ్ కుమారస్వామి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన 60 కుటుంబాలు

ధర్మవరం: నవరత్నాల సంక్షేమ పథకాలతో సామాన్య ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచిన సీఎం జగనన్నతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణంలోని 29వ వార్డు ఇన్‌చార్జ్ బాలిరెడ్డి ఆధ్వర్యంలో 305 కుటుంబాలు, 22వ వార్డు ఇన్‌చార్జ్ కుమారస్వామి ఆధ్వర్యంలో 60 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. అంజి, వెంకటస్వామి, ఇబ్రహీంఆలీ, నాగరాజు, చంద్రశేఖర్, రామాంజినేయులు, పార్థసారథి, నారాయణస్వామి, బయన్న, సూర్యప్రతాప్, సుధాకర్, వెంకటేశ్‌లతో పాటు మొత్తం 365 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి సీఎంగా జగనన్న బాధ్యతలు చేపట్టాక ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ జగనన్న అండగా నిలబడి ప్రతి ఒక్కరికీ సాయం అందించారన్నారు. పిల్లల చదువులకు జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా, వసతి దీవెన, నాడు నేడు ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోనే ఐదేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా జగనన్న రూ.3,200 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.5వేల కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, వార్డు ఇన్‌చార్జ్‌లు కుమారస్వామి, బడన్నపల్లి కేశవరెడ్డి, నాయకులు పరంధామిరెడ్డి, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిచ్చారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం దొరిగిల్లు క్వార్టర్స్, నాగలగుబ్బల, నక్కలపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బాణాసంచా పేల్చి ఎమ్మెల్యేకు పూలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు చంద్రబాబు, జగనన్న పాలనను ప్రతి ఒక్కరూ గమనించి అభివృద్ధి సంక్షేమం అందించే నాయకుడికి పట్టం కట్టాలన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా చేసినా ప్రజలకు గుర్తుండిపోయే పథకం ఒక్కటీ లేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఉచిత విద్యుత్‌తో పాటు ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ పథకాలు ప్రజలకు నేటికీ గుర్తున్నాయన్నారు. జగనన్న తండ్రి అడుగు జాడల్లో నడిచి నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ రాణి, ఎంపీటీసీ మధుసూదనాదేవి, ఉపసర్పంచ్ అంజి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మునిచంద్ర, మహేష్, శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, లక్ష్మీనాయక్, రామునాయక్, చలమారెడ్డి, క్రిష్ణ, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం



మహిళా కూలీకి పథకాలను వివరిస్తున్న దుద్దుకుంట కిషన్‌రెడ్డి



చింతలయ్యగారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

అమడగూరు: రాబోయే ఎన్నికల్లో మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన సోలుకుంట్ల, మామిడిమాకులపల్లి, గుండువారిపల్లి, ఎస్సీ కాలనీల్లో ప్రతి ఇంటికీ తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓటేయాలని జోరుగా ప్రచారం నిర్వహించారు. కిషన్‌రెడ్డి ఐదేళ్లలో ఆయా కుటుంబాలకు జరిగిన మేలును కుటుంబ సభ్యులకు వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్ల కాలంలో ప్రజలకు ఏం మేలు జరగలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఒక్క అవకాశం ఇచ్చిన ఐదేళ్లలోనే ఎంతో మంచి చేశామని, మరో అవకాశమిస్తే మరింత మేలు చేస్తారని సీఎం జగనన్నను, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని ఆశీర్వదించి ఓటేయాలని కోరారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవితాశివశంకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సర్పంచ్ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఈశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరమణ, శ్రీరాములు, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుష్ట చతుష్టయానికి బుద్ధి చెబుదాం

పుట్టపర్తి: ఎన్నికల్లో ఓటు ద్వారా టీడీపీ దుష్టచతుష్టయానికి బుద్ధి చెబుదామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ఓటర్లకు సూచించారు. ఆయన బుక్కపట్నం మండలం గణికవారిపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని తద్వారా రెండో సారీ జగన్‌ను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో అనైతిక పొత్తులతో రాజకీయాలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోవిందరెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటేస్తే సంక్షేమ పథకాలు గల్లంతే



తాడిమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

తాడిమర్రి: టీడీపీ కూటమికి ఓటువేస్తే సంక్షేమ పథకాలు గల్లంతవుతాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోదరుడు యువనేత కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలసి తాడిమర్రిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీ సభ్యుల వద్దకు వెళితే లంచం తీసుకుని వారి పార్టీ సానుభూతి పరులకు మాత్రమే ఇచ్చేవారన్నారు. సంక్షేమ పథకాలు పక్రమంగా అందాలన్నా, గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా తిరిగి వైఎస్సార్ సీపీ గుర్తు ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వర్థ, ఉప సర్పంచ్ తాడిమర్రి రమణారెడ్డి, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, సచివాలయాల మండల కన్వీనర్లు మల్లప్పగారి మాధవరెడ్డి, అల్లే సాయినాథ్‌రెడ్డి, నాయకులు బండారు పెద్దఓబిలేసు, తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, మారక శివారెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, ఆర్వేటి కాటమయ్య, అల్లే జగదానంద రెడ్డి, శెట్టిపల్లి ఆనందరెడ్డి, సిద్దే రామకృష్ణారెడ్డి, బండారు నారాయణస్వామి, బీసాని లక్ష్మన్న, సర్పంచ్ కుంటాల పుల్లయ్య, ఎంపీటీసీ చంద్రబాబు, సదానంద పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి



మీర్జాంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తచెరువు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం బంగారుచెన్నైపల్లి, మీర్జాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బావమరిది రాఘవరెడ్డి, మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సింగిల్ విండ్ మాజీ అధ్యక్షుడు తలమర్ల రెడెప్పరెడ్డి, కొడగానిపల్లి రఘునాథరెడ్డి, నరసింహారెడ్డి, నారేపల్లి సర్పంచ్ ప్రకాష్, మాజీ సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మటన్ శంకర్, నాయకులు గోవిందరెడ్డి, నాగేంద్ర, పోతిరెడ్డి, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబుళపతి, కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలం కప్పలబండలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నరసారెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తో కలిసి ప్రచారం నిర్వహించారు. పరిశీలకులు మాధవరెడ్డి, ఫొటోసాయి, నాయకులు గంగాద్రి, కుమారి, సచివాలయ కన్వీనర్ శేఖర్, మాజీ సర్పంచ్ యర్రప్ప, సురేంద్రరెడ్డి, నారాయణస్వామి, రవి, కరుణాకర్, నాగన్న, రాజప్ప, తదితరులు ఉన్నారు.

కొనసాగిన పింఛన్ల కష్టాలు



పోట్లమర్రి సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బత్తలపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు అనుచరులు ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టిన నేపథ్యంలో లబ్ధిదారులు ఈ నెల పింఛన్లు సచివాలయానికి వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సచివాలయం దాకా నడవలేక మధ్యలో ఆగుతూ కాసేపు సేద తీరుతున్నారు. నానా కష్టాలు పడి ఎలాగోలా గ్రామ సచివాలయాలకు చేరుకుని పింఛన్లు నగదు తీసుకుంటున్నారు. తమకు ఈ అవస్థలు కల్పించినందుకు చంద్రబాబుపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయం మెట్లు ఎక్కలేక..

మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లోని మెట్లు ఎక్కడానికి వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శివారు ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు అక్కడక్కడ సేదతీరుతూనీడలో ఉంటూ సచివాలయానికి చేరుకుని పింఛను తీసుకుంటున్నారు. పోట్లమర్రి గ్రామ సచివాలయంలోని కార్యదర్శి ప్రకాష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మధుసూదన్ బెడ్‌పై ఉన్నవారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అదేవిధంగా సచివాలయం వద్ద మెట్లు ఎక్కలేని వారికి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో పలువురు సచివాలయం బయటే పింఛన్లు ఇస్తున్నారు. తద్వారా ఈ సచివాలయాల పుణ్యాన తమకు పింఛన్ సక్రమంగా అందుతోందని, ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని దీవిస్తున్నారు.

99శాతంపైగా పింఛన్లు పంపిణీ..

సచివాలయాల వద్ద మూడో రోజు కూడా పింఛన్లు పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగింది. మండలంలో శనివారం సాయంత్రం 6 గంటల వరకు 99 శాతం పైగా పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మండల వ్యాప్తంగా 6,441 పింఛన్లుండగా అందులో 6,377 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఓటమి భయంతోనే తప్పుడు రాతలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

కదిరి: వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ తప్పుడు కథనం ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యంపై పరువు నష్టం కేసు వేస్తామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు జిలాన్, చైర్‌పర్సన్ నజీమున్నీసా భర్త సాదిక్, కౌన్సిలర్లు ఇస్మాయిల్, మహమ్మద్, మురళి, శంకర్, దాదాపీర్ ఆంధ్రజ్యోతిలో 'వైసీపీలో అనుమానం' శీర్షికతో ప్రచురితమైన కథనం పూర్తిగా అవాస్తవమన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో కదిరిలో నిర్వహించిన రోడ్‌షోకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఆ జనాన్ని చూసి టీడీపీకి ఓటమి తప్పదనే భావనతో 'ఆంధ్రజ్యోతి' ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కొందరు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ కథనంలో రాశారని అది నిజం కూడా కాదన్నారు. కదిరిలో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ వరుసగా రెండుసార్లు గెలిచిందని, ఈ ఎన్నికల్లో గతంకంటే ఎక్కువ మెజార్టీతో మక్బూల్ అహ్మద్ గెలవడం ఖాయమన్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..

వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్‌పై తప్పుడు కథనాలు రాస్తున్న కదిరి ఆంధ్రజ్యోతి విలేకరి అమృతరాజ్ బాగోతంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిచ్చిలి శంకర్ పేర్కొన్నారు. సదరు విలేకరి భార్య ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నప్పటికీ ఆ కుటుంబానికి రేషన్ కార్డు ఉందన్నారు. అలాగే ఆయన 10 మంది బినామీ పేర్లతో ఇళ్లు మంజూరు చేయించుకొని కుటాగుళ్లలో ఒక పెద్ద ఇల్లు కట్టుకున్నారని ఆరోపించారు. అధికారులను బెదిరించి నెలసరి మామూళ్లు తీసుకుంటున్నారని, రెవెన్యూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి పలు చోట్ల ఇంటి స్థలాలు తీసుకున్నారన్నారు. కౌన్సిలర్లు రాంప్రసాద్, నౌషాద్, ఆవుల స్వామి, ఎస్‌కే వలీ, బొబ్బిలి రవి, ఉట్టిఓంప్రకాష్, షానూ, గంగాధర్, ఎహసాన్, ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ గోపాలక్రిష్ణ, మాజీ కౌన్సిలర్ క్రిష్ణానాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, చెన్నూరు గంగాధర్ పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

ఎన్పీకుంట: టీడీపీ నేతల ఫిర్యాదుతో తమను విధులకు దూరంగా ఉంచడాన్ని నిరసిస్తూ వెలిచలమల సచివాలయం పరిధిలోని 8 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఆదినారాయణకు సమర్పించారు. వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని తమకు కల్పించారన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా తాము చేస్తున్న సేవలు ప్రతిపక్షాలకు తెలిసినా నేడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కుటిల రాజకీయాలు చేస్తూ తమను ప్రజల నుండి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై తామంతా కలిసికట్టుగా పనిచేసి రాబోవు ఎన్నికలలో మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, కదిరి ఎమ్మెల్యే గా బీఎస్ మక్బూల్ అహ్మద్ ను గెలిపించుకునేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

అమడగూరు: కసముద్రం పంచాయతీకి సంబంధించిన ఐదుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకుంటామని వలంటీర్లు లావణ్య, మురళీ, ఇర్ఫాన్, మణికంఠ, చాంద్‌బాషా తెలిపారు.

నల్లమాడ: మండలంలోని వేర్వేరు పంచాయతీలకు చెందిన 39 మంది గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. పాతబత్తలపల్లి గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 22 మంది, చారుపల్లి సచివాలయం పరిధిలోని 16 మంది, యర్రవంకపల్లి సచివాలయం పరిధిలో 11 మంది రాజీనామా పత్రాలను పంచాయితీ, సచివాలయ కార్యదర్శులు నిర్మల, సందీప్, వెంకటేష్‌నాయక్‌కు అందజేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్నకు తోడుగా ఉండాలని భావించి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గెలుపునకు సైనికుల్లా పని చేస్తామన్నారు.

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల నేపథ్యంలో తమ విధులకు చంద్రబాబు అడ్డుపడడంతో వలంటీర్లు ఏకంగా రాజీనామాలు సమర్పించి ఎన్నికల్లో పాల్గొని జగనన్నను గెలిపించు కుంటామని ప్రతినబూనారు. పుట్టపర్తి మండలం పెడపల్లి మేజర్ పంచాయతీకి చెందిన పలువురు వలంటీర్లు శనివారం రాజీనామ చేశారు. వలంటీర్లు సునీల్‌కుమార్, శ్రీనివాసులు, బుడన్‌ఖాన్, విజయ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, హరీష్, రాజకళ, నందిని, లక్ష్మీ, కుమారి, మాధవి, గీతాకుమారి, వాణి, వెంకటనారాయణ స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి రాజీనామ పత్రాలను అందజేశారు.



పాతబత్తలపల్లిలో సచివాలయ కార్యదర్శికిరాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో పని చేస్తున్న వలంటీర్లు మారుతి, ప్రసాద్‌రెడ్డి, శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు అందజేశారు.

'సాయి అమూల్య విల్లాస్'కు భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలో కర్ణాటక నాగేపల్లి వద్ద సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో అధునాతన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మిస్తున్న సాయి అమూల్య విల్లాస్ భూమి పూజ శనివారం ఘనంగ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రమేష్ డెవలపర్స్ అధినేత రమేష్, ప్రదీప్ మాట్లాడుతూ ఇందులో 180 విల్లాస్ ఉంటాయని, అన్నీ పుడా అప్రూవల్ తీసుకున్నామన్నారు. 40 అడుగుల రోడ్లు, 24 గంటలూ నీళ్లు, విద్యుత్ సౌకర్యం ఉంటాయన్నారు. అతి తక్కువ సమయంలోనే నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. జబర్దస్త్ టీం సభ్యులు రాంప్రసాద్, రోహిణి, శాతి స్వరూప్ తదితరులు కామెడీ పంచ్‌లు, స్కిట్లతో ఆహుతులను కడుపుబ్బ నవ్వించారు.

సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యత



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

బత్తలపల్లి: సార్వత్రిక ఎన్నికల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యతని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు చెందిన సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, బీఎల్ఓలకు, పోస్టల్ బ్యాలెట్ సిబ్బందికి అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు నిర్భయంగా ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. సెక్టోరియల్ అధికారులకు మేజిస్ట్రేట్ పవర్‌ను ఎన్నికల కమిషన్ కల్పించినట్లు చెప్పారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిస్థాయిలో చదివి పక్కాగా ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేంతవరకు సెక్టార్ అధికారులదే పూర్తి బాధ్యత అని తెలిపారు. అదేవిధంగా ఏయే అధికారులు ఎలాంటి విధులు నిర్వహించాలనే అంశాలను విశదీకరించారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టిందన్నారు. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన ముఖ్యం



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: ఎండతీవ్రత దృష్ట్యా వడదెబ్బపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్ఎస్‌కే ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. శనివారం జగరాజుపల్లి మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఏవైనా ముఖ్యమైన పనులు ఉన్నా ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 3 గంటల తరువాత బయటకు వెళ్లాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని, చెప్పులు, తాగునీరు, గొడుగు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఇంటి వద్ద తయారు చేసుకోవాలన్నారు. హెచ్ఎం నాగసుప్రజ, సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలకు చెందిన లింగమయ్య బేల్దారి పని కోసం బైక్‌పై అరిగెల పోతన్న రైస్ మిల్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లింగమయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.